

8న జాతీయ లోక్ అదాలత్

తణుకు : మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్, న్యాయ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి గురువారం పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ జాతీయ న్యాయసేవ సంస్థ ఢిల్లీ వారి ఆదేశం మేరకు 2025 సంవత్సరానికి గాను నాలుగు సార్లు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి జాతీయ లోక్ అదాలత్ కోర్టులు పనిచేయు ప్రతీ చోటా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశం రాజీపడు కేసులు రాజీ చేయుట, కేసులు రాజీ చేసుకొనుట వల్ల విలువైన సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చునని తెలిపారు. సివిల్ కేసుల్లో కోర్టుకు కట్టిన కోర్టు ఫీజు తిరిగి తీసుకొనే అవకాశం ఉందన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్కు బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, ప్రామిసరీ నోటు కేసులు అన్ని రకాల సివిల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసులుగా బ్యాంకు, టెలిఫోన్ బకాయి కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలియజేశారు.

'కల్తీ' కాటు..!

ఆహార కల్తీని పట్టించుకోని ప్రభుత్వం

రోగం మూలాలు వదిలేసి ఇతర అంశాలపై హడావుడి

హోటళ్లు, స్ట్రీట్‌ఫుడ్, వంటనూనె నిత్యావసరాలతో సహా అన్నీ కల్తీమయం

ఫుడ్ కలర్స్, టేస్టింగ్ కోసం కలిపే అనేక వాటితో వేగంగా జబ్బులు

కేన్సర్ కేసులు పెరుగుదలలో ఆహార కల్తీనే ప్రధానం

ఫుడ్ సేఫ్టీ శాఖ ఉన్నట్టా... లేనట్టా..

40 మంది ఉండాల్సిన చోట ఒకే ఒక్క అధికారి

తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా కల్తీ వ్యాపారం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేన్సర్ నుంచి అనేక రకాల రోగాలు వేగంగా పెరుగుదలకు కారణం ఆహారపు కల్తీనే అని స్పష్టంగా తెలుస్తోంది. ఆహార కల్తీని అరికట్టి ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. జబ్బులకు మూలమైన ఆహార కల్తీని పట్టించుకోకుండా ఇతర అంశాలపై పాలకులు చేస్తున్న హడావుడి చూసి అందరిలోనూ అసహనం వ్యక్తమవుతోంది. రోగం రాకుండా చర్యలు తీసుకోవడం మాని, రోగం వచ్చిన తర్వాత ఏం చేయాలనే దానిపై ప్రభుత్వాలు ముందుకు సాగుతున్న పరిస్థితి నెలకొంది. రోగాలబారిన పడుతున్న జనం సరైన వైద్యం అందక, ఆర్థికంగా తట్టుకోలేక ఎంతోమంది ప్రాణాలు విడుస్తున్నారు. రెండు జిల్లాల్లో కేన్సర్ వంటి ప్రమాదకర కేసుల పెరుగుదల వెనుక ఆహార కల్తీనే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ఆహార కల్తీని అరికట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ శాఖ జిల్లాలో ఉన్నా లేనట్టేనని చెప్పొచ్చు. ఏలూరు జిల్లాలో హోటళ్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లు వంటివి దాదాపు ఎనిమిది వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో లైసెన్స్ పొందినవి కేవలం రెండు వేలు మాత్రమే ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం ఆహార కల్తీని అరికట్టాలంటే పట్టణాల్లో లక్ష మంది జనాభాకు, గ్రామాల్లో 50 వేల మంది జనాభాకు ఒకరు చొప్పున ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఉండాలి. నిబంధనల ప్రకారం ఏలూరు జిల్లాలో ప్రధాన అధికారి కాకుండా 40 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదేవిధంగా నియామకాలు జరగాలి. ఏలూరు జిల్లాలో ప్రధాన అధికారి కాకుండా తనిఖీలు చేసే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఒకేఒక్కరు ఉన్నారు. పశ్చిమలోనూ ఒక అధికారితోనే పని చేస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ (ఆహార భద్రత, ప్రమాణాలు) శాఖ ఎందుకు ఉన్నట్లో ఎవ్వరికీ అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంత ప్రాముఖ్యతను ఇస్తుందో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.

కల్తీని అరికట్టడంలో చిత్తశుద్ధి ఏది..?

ఆహార కల్తీని అరికట్టి ప్రజలను రోగాల బారి నుండి కాపాడటంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి అనేది లేకుండాపోయింది. గతేడాది నవంబర్ నుంచి వైద్యఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో రెండు జిల్లాల్లోనూ కేన్సర్ అనుమానితుల సంఖ్య పెద్దఎత్తున ఉంది. ఇక కిడ్నీ, బిపి, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులు ఎక్కువగానే ఉన్నారు. ముఖ్యంగా కేన్సర్ కేసులు పెరుగుదలలో ఆహార కల్తీనే ప్రధాన పాత్రగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. హోటళ్ల నుంచి స్ట్రీట్ ఫుడ్ వరకూ ప్రతిచోటా ఫుడ్ కలర్స్, టేస్ట్ కోసం కలుపుతున్న అనేక పదార్థాలు రోగాలకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. వంటనూనె, బొంబాయి రవ్వ, చపాతి పిండి, టీ పొడి, పంచదార ఇలా ఏదీ కల్తీకి అనర్హం కాదన్నట్లు పరిస్థితి తయారైంది. నిత్యం ఉరుకులు, పరుగుల జీవితంలో ఎక్కువ మంది బయటి ఆహారాన్ని అత్యధికంగా ఉపయోగిస్తున్నారు. దీంతో రోగాల బారిన పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి మాట్లాడుతూ జీవన శైలి, ఆహారపు అలవాట్లు మారాలని, రైతులు పండించే పంటల్లోనూ మార్పులు రావాలని చెప్పుకొచ్చారు. కీలకమైన ఆహార కల్తీ గురించి మాత్రం మాట్లాడలేదు. నిత్యం తనిఖీలు చేస్తే తప్ప ఆహార కల్తీని అరికట్టడం సాధ్యం కాదు. ఫుడ్‌సేఫ్టీ శాఖలో సిబ్బంది లేకుండా తనిఖీలు ఏవిధంగా జరుగుతాయో ప్రభుత్వమే చెప్పాలి. తనిఖీలు లేకపోవడంతో ఆహార కల్తీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రోజురోజుకీ రోగుల సంఖ్య పెరిగిపోతోంది. పాలకులు ఇప్పటికైనా ఆహార కల్తీపై దృష్టి సారించి ప్రజలను రోగాల బారి నుంచి కాపాడాల్సిన పరిస్థితి ఉంది.

హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి

మరుగుదొడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి : కలెక్టర్ నాగరాణి



వసతి గృహంలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌సి బాలికల వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆడపిల్లలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి కాకపోతే చెల్లింపులు నిలిపివేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని ఎస్‌సి బాలికల, ఎస్‌టి బాలుర వసతిగృహాలను కలెక్టర్ నాగరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాలూక భీమవరం రైతుబజార్ దగ్గర్లో ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎస్‌సి కళాశాల విద్యార్థుల వసతిగృహం, ఎస్‌సి పాఠశాల విద్యార్థుల వసతి గృహం, బిసి విద్యార్థుల వసతి గృహాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎస్‌సి కాలేజీ విద్యార్థులకు ఆరు నూతన మరుగుదొడ్లు, బిసి వసతిగృహంలో పంపుసెట్టు ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మున్సిపల్ నిధులతో కాంట్రాక్టర్, ప్రభుత్వ నిధులతో హౌసింగ్ శాఖ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణం ఎప్పటిలోగా పూర్తి చేస్తారని కలెక్టర్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. మార్చి 10వ తేదీలోపు పనులు పూర్తవుతాయని కాంట్రాక్టర్ తెలిపారు. బాలికలకు ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బంది కలగకూడదని, నిర్ణీత గడువులోపు పనులు పూర్తి కాకపోతే చెల్లింపులు నిలిపివేస్తానని హెచ్చరించారు. అనంతరం ఆయా హాస్టళ్లలోని డార్మెటరీలను, మరుగుదొడ్లను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం టిడ్కో గృహ సముదాయాల దగ్గర్లో ఉన్న గునుపూడి ఎస్‌టి బాలుర వసతిగృహాన్ని ఆమె సందర్శించారు. హౌసింగ్ అధికారులతో మాట్లాడుతూ కొత్తగా డ్రైయిన్ నిర్మాణం, ఆర్‌ఒ ప్లాంట్ ఏర్పాటు, వాష్ ఏరియాలో బట్టలు ఉతుక్కోవడానికి బండల నిర్మాణం తదితర పనులను చేపట్టాలని సూచించారు. టాయిలెట్లను యాసిడ్, ఫినాయిల్‌తో క్లీన్ చేయించాలని వసతి గృహ అధికారిని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వండుతున్నారా అని ప్రశ్నించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, హౌసింగ్ పీడీ వై.హరిహరనాథ్, జిల్లా ఎస్‌సి సంక్షేమ శాఖాధికారి బి.రామాంజనేయరాజు, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి జి.గణపతిరావు, జిల్లా ఎస్‌టి సంక్షేమ శాఖాధికారి డి.పుష్పరాణి, వసతి గృహాధికారులు సిహెచ్.భానుమణి, వై.పద్మజ, జి.శ్యామల, డి.శ్రీనివాస్, హౌసింగ్ ఇంజినీర్లు బి.వెంకటరమణ, జి.పిచ్చయ్య, మున్సిపల్ ఇంజినీర్ అప్పలరాజు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలి


కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గ్రూప్-2 పరీక్షలు, ఇంటర్ పరీక్షలు, పి4 మోడల్ సర్వే, ఎంఎస్‌ఎంఇ సర్వే, జిల్లావారీగా పెర్ఫోప్షన్ ట్రాకింగ్ అంశాలపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ విజయవాడ నుంచి సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ నాగరాణి సమావేశమై మాట్లాడారు. ఈ నెల 23న ఆదివారం నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తిచేసి పగడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షలు నిర్వహించే కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షల కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరీక్షలకు డిఆర్‌ఒ ఇన్‌ఛార్జిగా ఉంటారన్నారు. సమావేశంలో డిపిఒ బి.అరుణశ్రీ, సిపిఒ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ యు.మంగపతిరావు, డిఐఇఒ నాగేశ్వరరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించండి

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) ముమ్మర ప్రచారం



భీమవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ, ఉద్యోగ, అధ్యాపక, కార్మిక, ప్రజాసంఘాలు బలపర్చిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రులు ప్రథమ ప్రాధన్యతా ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) కోరారు. భీమవరంలోని శ్రీ విష్ణు విద్యాసంస్థలు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, డిఎన్ఆర్ కళాశాలల్లో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులును గెలిపించాలని కోరుతూ గురువారం ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, అధ్యాపకులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలు, సంక్షేమంపై గత 17 ఏళ్లుగా పిడిఎఫ్‌కు చెందిన 16 మంది ఎంఎల్‌సిలు వాణి విన్పించారన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీమ్ వర్కర్స్ తరపున ప్రభుత్వాలను నిలదీశామన్నారు. ఆయా తరగతుల వారి సంక్షేమం, సమస్యల పరిష్కారానికి పని చేశామన్నారు. ప్రధానంగా ఉద్యోగుల పక్షాన నిలబడి రావాల్సిన డిఎలు, పిఆర్‌సి బకాయిలు, సిపిఎస్ రద్దు కోసం శాసనమండలిలోనూ, బయటా పోరాటం చేశామన్నారు. ఉపాధ్యాయునిగా, జెఎసి నాయకునిగా 35 ఏళ్లపాటు ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై జరిగిన పోరాటాల్లో సేవలందించిన దిడ్ల వీర రాఘవులు పోటీ చేస్తున్నారన్నారు. ఈ నెల 27న జరిగే పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లో 14వ నెంబర్‌లో ఉన్న దిడ్ల వీర రాఘవులు పేరు ఎదురుగా ప్రథమ ప్రాధాన్యత ఓటుగా 1వ నెంబర్ వేసి గెలిపించాలని కోరారు. ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ ఇళ్ల వెంకటేశ్వరరావు గత ఐదేళ్లు ఆదర్శంగా పని చేశారన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిగా పని చేసిన ఆయన మళ్లీ తాను పోటీ చేయనని స్వచ్ఛందంగా తప్పుకుని, దిడ్ల వీరరాఘవులుకు అవకాశం కల్పించారన్నారు. నిరాడంబరంగా ఉండడానికి సహాయకులుగాని, గన్‌మెన్‌నుగాని పెట్టుకోలేదన్నారు. ఈ ప్రచారంలో నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు భూపతిరాజు రవికుమార్‌రాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, అల్లూరి సుబ్బరాజు, బంగార్రాజు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, నాయకులు చెల్లబోయిన పట్టాభిరామయ్య, కుమార్ బాబ్జి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ఎన్.రాజు, భీమవరం యూనిట్ కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, శ్రీరంగరాజు, రామచంద్రరాజు, ప్రజాసంఘాల నేతలు గోపాలన్, వాసుదేవరావు, టి.ప్రసాద్, క్రాంతి, రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురం: గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) కోరారు. గురువారం నరసాపురంలో పలు విద్యాసంస్థలు, నివాస ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవి శాసనమండలిలో నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజల సమస్యలపై పోరాడేది పిడిఎఫ్ సభ్యులేనన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని కూటమికి ఈ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. మేధావుల సభగా పేరొందిన శాసనమండలికి రాజకీయ నిరుద్యోగులను పంపొద్దని ఆయన కోరారు. ఈ ప్రచారంలో ప్రజాసంఘాల నాయకులు కౌరు పెద్దిరాజు, ముచ్చర్ల త్రిమూర్తులు, మంచిలి నీలకంఠం, పొగాకు పూర్ణ, పొగాకు నారాయణరావు, పి.వాసు, టి.ప్రసాద్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు: పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ కోరారు. గురువారం పట్టణంలోని వివిధ సంస్థల్లో విస్తృత ప్రచారం చేసి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, నిరుద్యోగ సమస్యల పరిష్కారం కావాలంటే పిడిఎఫ్ అభ్యర్థులు గెలవాలన్నారు. మేధావులకు కేటాయించిన స్థానాల్లో రాజకీయ జోక్యం సరైంది కాదన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఆలోచించి ఓటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీనివాస్, ఎస్.పురుషోత్తం, చల్లా సోమేశ్వరరావు, తాళాబత్తుల గంగరాజు పాల్గొన్నారు.

భీమవరం: ఉద్యోగ, ఉపాధ్యాయ, మేధావుల సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని సిఐటియు నేతలు గురువారం ఇంటింటికీ ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిఐటియు నేత బి.వాసుదేవరావు మాట్లాడుతూ దిడ్ల వీరరాఘవులు పేరు బ్యాలెట్ పేపర్లో 14వ సీరియల్ నెంబర్‌లో ఉంటుందని, అక్కడ ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, కోదండం, ఆదినారాయణ పాల్గొన్నారు.



నరసాపురంలో...

గణపవరం: ప్రజా సమస్యలు లేవనెత్తే పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గురువారం కోమర్రులో ప్రజాసంఘాల నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మేడిశెట్టి పెంటారావు, విప్పర్తి సత్యం ప్రచారం నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులను, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిశారు.

ఉండి: పెద్దల సభకు పెద్దలనే పంపి నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పాల్గొన్నారు.


పేదల భూములు లాక్కోవడమే అభివృద్ధా

భూస్వాములు, పెత్తందారులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూముల సంగతేంటీ

పేదలకేనా నోటీసులు.. పెద్దలకు ఇవ్వరా?

అసైన్డ్, పోరంబోకు, ప్రభుత్వ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో తేల్చండి


సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



మాట్లాడుతున్న గోపాలన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రభుత్వ భూములను రక్షించాలనే చిత్తశుద్ధి ఉంటే భూస్వాములు, పెత్తందారులు ఆక్రమించుకున్న భూములను ముందుగా స్వాధీనం చేసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఇది చేయకుండా అభివృద్ధి, కాలుష్యం పేరుతో నిరుపేదల భూమిని, ఇళ్లను కూల్చివేయడం సిగ్గుచేటన్నారు. దిక్కు మొక్కు లేని పేదలకు కాకుండా ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న పెత్తందారులు, భూస్వాములకు నోటీసులిచ్చి వారి ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునే ధైర్యం ఉండి ఎంఎల్ఎకు ఉందా అని ప్రశ్నించారు. పాలకోడేరు శివారు ఎఎస్ఆర్ నగర్‌లో గత 40 ఏళ్ల నుంచి నివశిస్తున్న 130 మంది పేదల గృహాలతోపాటు వీటి వెనుక భూస్వాములు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న ప్రాంతాలను గురువారం ఆయన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ రెక్కల కష్టంతో జీవనం సాగిస్తున్న పేదలకు నోటీసులిచ్చి విద్యుత్ కనెక్షన్లు కట్ చేస్తున్నారని, సొంత భూములున్నా ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్న పెత్తందారులకు, భూస్వాములకు ఎందుకు నోటీసులు ఇవ్వరని ప్రశ్నించారు. రాష్ట్రంలో, జిల్లాలో ఎక్కడా పేదల గుడిసెలకు విద్యుత్ కనెక్షన్లు తొలగించి బుల్డోజర్లతో కూల్చిన ఘటనలు లేవన్నారు. ఐదేళ్లు ఢిల్లీలో ఉండి బిజెపి రాజకీయాలు చూసి ఇక్కడ అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేదల ఇళ్ల వల్ల కాల్వలు కలుషితమవుతున్నాయనే ప్రచారం శాస్త్రీయం కాదన్నారు. జిల్లాలో పరిశ్రమలు, ఆక్వా చెరువుల వల్ల కాలుష్యం పెరుగుతుంటే మీకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, చిత్తశుద్ధి ఉంటే ధవళేశ్వరం నుండి పైపులైను ద్వారా అన్ని గ్రామాలకూ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. అంతేగాని పేదలను కొట్టి పెద్దలకు పెట్టాలని చూస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిజమైన అభివృద్ధికి సిపిఎం చిత్తశుద్ధితో కట్టుబడి పని చేస్తుందన్నారు. ప్రజలను రోడ్ల పాల్జేసి అభివృద్ధి అనడం అవివేకమన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పోరంబోకు భూములు ఎవరెవరి ఆధీనంలో ఉన్నాయో తేల్చాలని డిమాండ్ చేశారు.



ఆర్టిఫిషియల్‌లో అబ్దుల్ కలాం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో స్వర్ణాంధ్ర ముందడుగు

గర్విస్తున్నాం : కాలేజ్ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విప్లవాత్మక ముందడుగు వేసింది. భారత మాజీ రాష్ట్రపతి, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలాంని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పునరుద్ధరించడం ద్వారా తాము టెక్నాలజీ అభివృద్ధిలో ఎంత ముందంజలో ఉన్నామో నిరూపించింది. ఈ ప్రత్యేకమైన ఆవిష్కరణలో కలాం వాయిస్ మోడలింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, డీప్ లెర్నింగ్ ఆధారంగా రూపొందించిన ప్రత్యేకమైన మోడల్ సహాయంతో ఆయన ప్రసంగ శైలిని, వాక్య నిర్మాణాన్ని, అంతర్‌దృష్టిని పున సృష్టించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులు, ప్రజలు నేరుగా కలాం మాటలను వినే అవకాశం పొందారు. ఈ ప్రాజెక్ట్ వెనుక స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ పరిశోధకులు, విద్యార్థులు, ప్రొఫెసర్ల కృషి అమోఘం. మేధోసంపత్తిని వాడుకుంటూ, టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగిస్తూ, ఈ పథకం ద్వారా విద్యార్థులకు పరిశోధనా రంగంలో కొత్త అవకాశాలను అందించారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ ఛైర్మన్ కెవి.సత్యనారాయణ మాట్లాడుతూ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం కలలను సాకారం చేసే దిశగా మేము మరో అడుగు వేసినందుకు గర్విస్తున్నామన్నారు. భవిష్యత్ తరాలకు టెక్నాలజీ శక్తిని అర్థం చేసుకునేలా చేయడం మా ప్రధాన లక్ష్యం అని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, ట్రెజరర్ కె.వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్ పాల్గొన్నారు.

హమాలీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్



సివిల్ సప్లై గోడౌన్ వద్ద నిరసన తెలుపుతున్న కూలీలు

తణుకు : సివిల్ సప్లయిస్ హమాలీలకు కూలీ రేట్లు రూ.25 నుంచి రూ.28కు పెంపు, 14 నెలల ఏరియర్స్ చెల్లింపు జిఒ వెంటనే జారీచేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సివిల్ సప్లై గోడౌన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా జరిగింది. సివిల్ సప్లై హమాలీలకు పెంచిన రేట్లు జిఒల రూపంలో ఇవ్వాలని, 14నెలలు ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని, ఇఎస్ఐ అమలు చేయాలని, కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కారం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత 14 నెలలుగా రేట్ల పెంపుదల చేయకుండా కార్మికులను మానసికంగా వేధించడం అన్యాయమన్నారు. ఎన్నో ఆశలతో తెచ్చుకున్న నూతన ప్రభుత్వం కూడా కార్మికుల గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులకు ఉన్న రేట్లు చాలా తక్కువని, అలాంటిది పెంచిన వాటిని అమలు చేయకపోవడం, జిఒలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి విజయవాడ ఆటోనగర్‌లో వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే హమాలీ కార్మికుల హామీలు అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గార రంగారావు, ఎన్.చిన్నారావు, టి.కృష్ణారావు, రాము, నాయుడు, ధనరాజు, శివప్రసాద్, సుధాకర్, పెంటయ్య, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

బెంచీల ఏర్పాటుకు అభ్యంతరమేలా..!

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్ స్టేషన్ వద్ద ప్రయాణీకుల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేస్తే ఎస్ఐ రాజకుమార్ అభ్యంతరం వ్యక్తం చేయడం పట్ల కొంత మంది గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసిపి నేత మద్దాల అప్పారావు బుధవారం రాత్రి పోలీస్ స్టేషన్ వద్ద బెంచీలు ఏర్పాటు పట్ల ఎస్ఐ అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న బస్‌షెల్టర్‌లో కొంత మంది పెద్దలు నిత్యం అక్కడే కూర్చోవడంతో ప్రయాణీకులు కూర్చోవడానికి ఆస్కారం లేకుండా ఉంది. ప్రయాణీకుల ఇబ్బందులు గమనించిన అప్పారావు బస్‌షెల్టర్‌కు మరోపక్క పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా బెంచీలు ఏర్పాటుకు ముందుకు రావడం జరిగింది. అయితే స్టేషన్‌కు ఎదురుగా బెంచీలు ఏర్పాటు చేస్తే వచ్చే ఇబ్బందులను ఎస్ఐ తెలియజేస్తూ అభ్యంతరం వ్యక్తం చేశారు. కొంత మంది ఫిర్యాదుదారులు పోలీస్ స్టేషన్‌కు వచ్చే క్రమంలో ఇక్కడే నిత్యం ఉంటున్న కొంతమంది వ్యక్తుల వల్ల నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు రాలేకపోతున్నామని తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇదేవిధంగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను తప్పుదోవ పట్టించిన సందర్భాలున్నాయంటూ తెలిపారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులను బట్టి ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా బస్‌షెల్టర్‌లో కూర్చుంటున్న పెద్దలు అర్థం చేసుకోవాలన్నారు. బస్‌షెల్టర్ వద్ద అదనంగా బెంచీలు ఏర్పాటు చేసుకుంటే ఎటువంటి అభ్యంతరం లేదని ఎస్ఐ చెబుతున్నారు. ఇదిలా ఉంటే పక్కనే ఉన్న ఒక దస్తావేజుల లేఖరి కార్యాలయం వద్దకు వచ్చే వారు కూర్చోవడం కోసం, ఒక షాపు వద్దకు వచ్చే వినియోగదారులు సేద తీరడానికి మాత్రమే ఈ బెంచీలు ఏర్పాటు చేస్తున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మార్చి 24, 25 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

ఎఐబిఇఎ జాతీయ సభ్యులు టివి.సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న టివి.సూర్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

12వ ద్వైపాక్షిక ఒప్పందంలో పెండింగ్‌లో వున్న డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని, బ్యాంకు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎఐబిఇఎ జాతీయ సమితి సభ్యులు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లిగూడెం బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద యుఎఫ్‌బియు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలు రెండు సంవత్సరాలు పెండింగ్‌లో ఉంచటం సరికాదన్నారు. 5 రోజుల బ్యాంకింగ్ సత్వరమే అమలు జరపాలని డిమాండ్ చేశారు. 30 సంవత్సరాల ముందు ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం రివిజన్ కోసం పది లక్షల మంది పెన్షనర్లు ఎదురుచూస్తున్నారన్నారు. స్టేట్ బ్యాంకు అధికారుల సమాఖ్య(ఎఐబిఒసి) జోనల్ కార్యదర్శి జి.జవహర్ లాల్ మాట్లాడుతూ బ్యాంకింగ్ పరిశ్రమ నిత్యం కస్టమర్ల సర్వీస్‌తో ముడిపడి వుంటుందని, గత ఐదారు సంవత్సరాలుగా బ్యాంకుల్లో రిక్రూట్మెంట్ వెనకబడి పోయిందని, రెండున్నర లక్షలకుపైగా ఖాళీలు బ్యాంకుల్లో ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రిక్రూట్మెంట్ లేని కారణంగా వున్న సిబ్బందిపైన అధిక పనిభారం పడి వారిపై ఒత్తిడి పెరుగుతోందని, దానివల్ల సర్వీస్‌లో కూడా నాణ్యత లోపిస్తుందని వారు వ్యాఖ్యానించారు. యుఎఫ్‌బియు కన్వీనర్ ఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని, అన్ని యూనియన్ల సభ్యులు చైతన్యంగా అన్ని సమ్మె కార్యక్రమాలలో పాల్గొవాలని కోరారు. బిఒఐ స్టాఫ్ యూనియన్ జాయింట్ సెక్రటరీ బి.ఏడుకొండలు, యుబిఐ ఉద్యోగుల డిప్యూటీ రీజనల్ సెక్రటరీ బి.దివ్య రజని మాట్లాడుతూ సమ్మెను పూర్తిగా జయప్రదం చేయాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఎస్‌బిఐ ఉద్యోగ నాయకులు కిరణ్, పవన్ కుమార్, సూర్యనారాయణ ఉద్యోగ సంఘాల సంఘటిత పోరాటమే విజయాలు కలిగిస్తుందని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ పిఎన్ఆర్.బాబు, కెవిబి నాయకులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

పెనుమంట్ర : మండలంలోని నత్తరామేశ్వరం గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయావరణలో పెనుమంట్ర గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు సత్తి శ్రీనివాస్ రెడ్డి రూ.3.50 లక్షలతో నిర్మించిన ప్యూరిఫైడ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ దాతలు రిటైర్డ్ ఎస్ఇ సత్తి నాగిరెడ్డి, మహాలక్ష్మి ప్రవాస భారతీయులు సత్తి శ్రీనివాసరెడ్డి, లక్ష్మీ తేజశ్రీ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్లాంటును ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ ప్లాంట్‌ని నిర్మించి, ఆలయానికి అప్పగించినట్లు దాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆకే సూర్యనారాయణ, గ్రామ ఎంపిటిసి సభ్యులు తమనంపూడి నాగ సత్యనారాయణ రెడ్డి, గ్రామ సర్పంచి వెలగల ధర్మారెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

పెనుమంట్ర : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతలో వివిధ రంగాలలో తమ సేవలు అందిస్తున్న ప్రతిభావంతులైన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సహాయ ఫౌండేషన్(భీమవరం) ప్రతినిధి జిల్లెళ్ళ సత్య సుధామ గురువారం తెలిపారు. విద్య, వైద్యం, క్రీడలు, కళలు, కవితలు, సామాజిక సేవా కార్యక్రమాలు స్వచ్ఛంద సంస్థ ద్వారా గానీ, వ్యక్తిగతంగా గానీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళా అభ్యర్థులు ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. తమ బయోడేటా, సేవ చేస్తున్న సంస్థ వివరాలను కేవలం వాట్సప్ నెంబర్ 9951207745కు పంపాలని ఆమె అన్నారు. మార్చి 7వ తేదీ శుక్రవారం జిల్లా అధికారుల ద్వారా గౌరవ మహిళా పురస్కారాల పేరిట భీమవరంలోని గునుపూడిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విజ్ఞాన సాంస్కృతిక భవనం వేదికగా ప్రదానం చేస్తామని ఆమె తెలిపారు.

మలేరియా టెస్టుల నిర్వహణ పరిశీలన

గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు మలేరియా టెస్టులు ఏవిధంగా చేస్తున్నారు అనే విషయంపై గురువారం తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మూడవ సచివాలయం సందర్శించి స్థానిక బస్‌స్టాండ్ ఏరియాలో జరిగే ఫీవర్ సర్వే ఏవిధంగా జరుగుతున్నది వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇంటికి వచ్చిన వైద్యసిబ్బందికి స్థానికులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎం.నల్లయ్య పాల్గొన్నారు.

'లయన్స్ ద్వితీయ గవర్నర్‌గా ఆర్‌విఎస్‌ను గెలిపించాలి'

ఉండి : లయన్స్ జిల్లా ద్వితీయ గవర్నర్‌గా ప్రతిపాదిస్తున్న పిఎంజెఎఫ్ లయన్ ఆర్‌విఎస్ సూర్యనారాయణరాజును బలపరచాలనిఉండి ఆకివీడు లయన్స్ క్లబ్ సభ్యులు సుబ్రహ్మణ్యం గురువారం కోరారు. ఈ ఉండి రూత్ కళ నివాసంలో ఉండి లయన్స్ క్లబ్ సమావేశం జరిగింది. సమావేశానికి సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేషన్ రుద్రరాజు నరసరాజు, క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌కు అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఆర్‌విఎస్‌ను ఎన్నుకోవాలి అన్నారు. వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు, క్లబ్ డిసి మెంబర్ కన్నెగంటి రూత్ కళ మాట్లాడారు. అనంతరం పేదలకు బ్రహ్మారెడ్డి ఆర్థిక సౌజన్యంతో దోమ తెరలు, సీతమ్మ అన్నదాన కార్యక్రమంలో భాగంగా పేదలకు, వృద్ధులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. వెంకన్న బాబు, హరినాథ్ రాజు, జగన్నాధరాజు, అనంతలక్ష్మి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం: మండలంలోని నవాబుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద న్యూ చైతన్య పెయింటర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపును నవాబ్ పాలెం గ్రామ సర్పంచి మద్దుకూరి గంగ భవాని, ధనరాజు దంపతులు ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో విజయవాడ ఆంధ్ర హాస్పటల్, తణుకు లలిత గ్యాస్ట్రో లివర్ కేర్ ఆస్పత్రి, ఏలూరు సమర్థిన్ ఆసుపత్రి వైద్యులు 150 మందికి గుండె, లివర్, కిడ్నీ, ఎముకలు, చర్మం, పులిపిరి కాయలు, కాళ్ల తిమ్మిర్లు వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సర్పంచి మద్దుకూరి గంగాభవాని ధనరాజు దంపతులు వైద్య సేవలు అందించిన వైద్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెయింటర్స్ అసోసియేషన్ సంఘ అధ్యక్షులు మాస బాబురావు, కార్యదర్శి జివి.సుబ్బారావు, కోశాధికారి ఉండ్రాజవరపు భాస్కరరావు, గ్రామ పెయింటర్ సంఘ నాయకులు జాన్, నాగరాజు, పండు పాల్గొన్నారు.

పలుచోట్ల సామాజిక న్యాయ దినోత్సవం

గణపవరం : గణపవరం డిగ్రీ కాలేజీలో గురువారం సామాజిక న్యాయదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక న్యాయం కోసం కృషిచేయాలని చెప్పారు. లెక్చరర్లు ఎన్.శ్రీనివాస్ రావు, జి.శారదదేవి, కె.స్వరూపరాణి, పి.భాస్కారావు, జి.వెంకటరావు పర్వీన్, బాలమణికంఠ విద్యార్థులు పాల్గొన్నారు.

మొగల్తూరు : చట్టముందు అందరూ సమానులేనని న్యాయవాది డి.నరసింహారాజు అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొగల్తూరులోని మూడో సచివాలయం వద్ద గురువారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలను అధిగమించటానికి చేయవలసిన కృషి కోసం, ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి 2007 ఫిబ్రవరి 20వ తారీఖున ప్రారంభించడం జరిగిందని వివరించారు. సచివాలయం సిబ్బంది, పిఎల్‌వి డి.వరలక్ష్మి, మెడికల్ టీం డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'నవధాన్యాలను ఉత్పత్తి చేయండి'

ఆకివీడు : నవ ధాన్యాలు తొమ్మిది రకాల జాతుల పంటల విత్తనాలు అని, ఇవి రైతులకు అనేక ప్రయోజనాలను అందిస్తాయని, ప్రతి ఒక్కరూ నవధాన్యాలను పండించి లబ్ధి పొందాలని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రాజెక్టు జిల్లా మేనేజర్ నూకరాజు చెప్పారు. మండలంలోని చిన్నమిల్లిపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. డ్రోన్‌ల వినియోగం వల్ల ఫలితాలను ఆయన వివరిస్తూ డ్రోన్‌లను వినియోగించే విధానం ప్రత్యక్షంగా కషాయాల వినియోగాన్ని పిచికారీ చేయించి చూపారు. అనంతరం మాట్లాడుతూ నేలశక్తి(ఆరోగ్యం) మెరుగుపడుతుందని, నీటి వినియోగం తగ్గుతుందని తెగుళ్ళ, వ్యాధుల బారి నుంచి పంటలకు రక్షణ లభిస్తుందని, దిగుబడి పెరుగుతుందని వివరించారు.

కృష్ణమూర్తికి నివాళులు

మొగల్తూరు : శేరేపాలెం గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, బిజెపి కిసాన్ మోర్చా మండల శాఖ మాజీ అధ్యక్షులు కత్తుల కృష్ణమూర్తి(74) విజయవాడలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. చినకాపు గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మొగల్తూరు అగ్రహారంలోని ఆయన స్వగృహం వద్ద ఉంచారు. ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు సందర్శించి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనుమంట్ర : ఈనెల 21వ తేదీ శుక్రవారం విద్యుత్ సబ్ డివిజన్‌లోని పెనుమంట్ర, పెనుగొండ, ఆచంట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని నరసాపురం విద్యుత్ శాఖ ఎఇ కె.మధుకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం 132/33 కేవీ పెనుగొండ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా ఈ మూడు మండలాల్లోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాలకొల్లు రూరల్: 33/11 కేవీ పాలకొల్లు సబ్ స్టేషన్‌లోని 11 కేవీ మార్టేరు ఫీడర్ చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం పూలపల్లి సెక్షన్ పరిధిలో గల గ్రామాలైన ఉల్లంపర్రు, సబ్బేవారి పేట గ్రామాలకు 21వ తేదీ శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఎఇ మధుకుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉండదని, సహకరించాలని అన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

6 మద్యం సీసాల స్వాధీనం

పాలకొల్లు : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో మండలంలోని లంకలకోడేరులో ఎం.వీరబ్రహ్మం అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు పి.మహేష్, జి.రఘు, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ హెచ్చరించారు.

'పది' పరీక్షలకు పూర్తిస్థాయి సన్నద్ధత

ప్రధానోపాధ్యాయులు జెఎల్ఎన్.శాస్త్రి

చిట్ చాట్

ప్రజాశక్తి - కాళ్ల

పాఠశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయి సన్నద్ధతో ఉన్నామని కాళ్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జెఎల్ఎన్.శాస్త్రి తెలిపారు. మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన తాగునీరు తదితర ఏర్పాట్లు చేయడానికి ఉపాధ్యాయులు సమన్వయంతో ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రజాశక్తితో ఆయన ముచ్చటించారు.



ప్రశ్న : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?

విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను నియమించి, ప్రత్యేక రివిజన్ క్లాసులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : ఎంతమంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు?

ఈ పాఠశాలల్లో బాలురు 56 మంది, 41 మంది బాలికలు మొత్తం 97 మంది పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

ప్రశ్న : పదోతరగతి పరీక్షలు ఎప్పటి నుంచి జరుగుతాయి?

మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ప్రతి పరీక్షకు మధ్య ప్రభుత్వం ఒక రోజు విరామం ప్రకటించగా, గణితం, సాంఘిక శాస్త్రం పరీక్షలకు అదనంగా మరొక రోజు విరామం దొరికింది.

ప్రశ్న : ఉత్తమ ఫలితాల సాధనకు మీరు తీసుకుంటున్న చర్యలు?

పాఠశాలలో ఉదయం, సాయంత్రం సమయాల్లో అదనంగా గంట చొప్పున నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : కాళ్ల హైస్కూల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గత ఏడాది ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు?

గత సంవత్సరం 71 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. దానిని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం అంతకంటే ఎక్కువ ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న : పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా?

ఉదయం, సాయంత్రం రివిజన్ చేయడం, వెనకబడిన పిల్లలకు ప్రత్యేక మెటీరియల్‌తో తర్ఫీదు ఇస్తున్నాం.

ప్రశ్న : విద్యలో వెనుకబడిన విద్యార్థులపై తీసుకుంటున్న చర్యలు?

ప్రత్యేక తరగతులు, ఒక్కొక్క టీచరుకి ఆరుగురు విద్యార్థుల చొప్పున భాధ్యతలు అప్పగించారు. ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిల్లలు చదువుతున్నారా? లేదా? ఎలా చదువుతున్నారు? అనే విషయాలు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తెలుసుకుంటున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఫోన్లో సందేహాలు నివృత్తి చేయడం జరుగుతుంది.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ కె .ప్రియాంక మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి తగ్గటం, బరువు తగ్గటం వంటివి క్షయ వ్యాధిగా గుర్తించవచ్చునని తెలిపారు. వారందరినీ గుర్తించి, పరీక్షలు నిర్వహించి, రోగ నిర్ధారణ అయిన తరువాత పూర్తి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధి గురించి ఎవరూ ఆందోళన చెందొద్దని, వ్యాధి నివారణకు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్‌వైజర్లు కె.గిరిబాబు, కె.రమేష్ బాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేసే పద్ధతిని అలవాటు చేయండి

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి ఇంటికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించే విధానాన్ని అలవాటు చేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సచివాలయ సిబ్బందికి, పారిశుధ్య కార్మికులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడి చెత్తను వరిమెగా తయారు చేసే విధానాన్ని వివరించారు. రాబోయే రోజుల్లో గ్రామాన్ని జిల్లాలోనే మోడల్‌గా తీర్చిదిద్దేలా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా మోడల్‌గా తయారు చేసేందుకు సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, ఎంఆర్‌సిఎం రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యలమంచిలి : కార్యక్రమంలో పాల్గొన్న ఎంఇఒ కృష్ణంరాజు

ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రతి విద్యార్థికి చిన్నతనం నుండే నాణ్యమైన విద్యను అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి రంగరాజు అన్నారు. గురువారం మండలంలోని కొంతేరు హైస్కూల్‌లో జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం ఎంఇఒ ప్రారంభించారు. ఈనెల 25వ తేదీ వరకు జరిగే ఈ శిక్షణలో అంగన్వాడీ కార్యకర్తలకు డిఆర్‌పిలకు క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుజాత రాణి, పిఇ సిహెచ్.ఇందిర, హసీనా నోడల్ ఆఫీసర్ పి.విజయలక్ష్మి, వివిధ గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరవాసరం : వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమం గురువారం కొనసాగింది. శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు భీమవరం సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం సందర్శించి శిక్షణ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. అంగన్వాడీ కార్యకర్తలను శిక్షణ గురించి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఆసక్తిగా శిక్షణను పొందాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆరు సంవత్సరాల వయసులోపు పిల్లలకు వివిధ కృత్యాలు ద్వారా నేర్పుతున్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సూపర్వైజర్స్ పిబివిఎల్.సరోజిని, డి.గీత, విద్యా శాఖ నుంచి ఎ.శ్రీరాములు, సురేష్, శ్రీనివాస్ శిక్షకులుగా పాల్గొన్నారు.

బాల్యమిత్రుని కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - మొగల్తూరు



కుటుంబ సభ్యులకు డిపాజిట్ పత్రాలు అందిస్తున్న స్నేహితులు

యజమానిని కోల్పోయిన కుటుంబానికి భరోసాగా బాల్య మిత్రులు నిలిచారు. మండలం రామన్న పాలెం పంచాయతీ పీవీ తోటలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1995-96 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పంపన చిరంజీవి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ఆనాటి సహచరులు ముందుకు వచ్చారు. చిరంజీవి ఇటీవల మృతి చెందాడు. ఆనాటి సహచరులు కొట్టు చింతారావు రూ.50 వేలు, మిగిలిన సహచరులు రూ.52,500 సమకూర్చి మొత్తం రూ.1,02,500 నగదును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను కుటుంబ సభ్యులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి బందెల ఎలీషా, పలువురు గ్రామస్తులు సహచరులను అభినందించారు.

సమిష్టి కృషితో దోమల నివారణ

ఫ్రైడే డ్రైడే అవగాహనా ర్యాలీ

గణపవరం : సమిష్టి కృషితో దోమలను నివారించవచ్చునని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు అన్నారు. గురువారం మూడవ సచివాలయం పరిధిలో జరిగిన ఫ్రై డే డ్రై డే అవగాహనా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. స్థానికులు ఆరోగ్య సూత్రాలు పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నీటి నిల్వలు లేకుండా చేసుకొని, వారానికి ఒకసారి ఫ్రై డే డ్రై డే పాటిస్తే దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్త కోటేశ్వరి, లక్ష్మీ కుమారి, ఆరోగ్య సహాయకులు యేహన్, కృష్ణ, శ్రీనివాస్, నల్లయ్య పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు

ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న సర్పంచి సోమేశ్వరరావు



మైక్రో ఫిల్టర్ వాటర్ ప్లాంట్ పనులను పరిశీలిస్తున్న సర్పంచి

కాళ్ల : ప్రజలందరికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పెదఅమిరం గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పేర్కొన్నారు. పెదఅమిరం గ్రామంలో మైక్రో ఫిల్టర్ వాటర్ నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి సోమేశ్వరరావు మాట్లాడుతూ మంచినీటి చెరువులో నీటినిల్వల సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. గ్రామంలో అన్ని ప్రాంతాలకు సక్రమంగా మంచినీరు అందించలేక పోతున్నామన్నారు. తాగునీటి అవసరాల కోసం మంచినీటి చెరువుగట్టుపై ఫిల్టర్ వద్ద రూ.18 లక్షలతో మైక్రో ఫిల్టర్ వాటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు నిధులు రూ.10 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.8 లక్షలతో ఈ పనులు చేస్తున్నామన్నారు. ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి అయితే స్వచ్ఛమైన నీరు ఎక్కువ కాలం అందించవచ్చునన్నారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన

వీరవాసరం : కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో ఇస్తున్న పిఎం సూర్యఘర్ పథకంలో వినియోగదారుడు ప్రభుత్వానికి నెట్‌మీటర్ ద్వారా సరఫరా చేస్తున్న సోలార్ విద్యుత్ యూనిట్ రేటు పెంచితే మరింత మంది ఈ పథకం ఏర్పాటుకు ముందుకు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ పథకం అవగాహనా కార్యక్రమాన్ని గురువారం అండలూరు, నవుడూరు పంచాయితీ కార్యలయం వద్ద ఏర్పాటు చేశారు. ఈ పథకం ద్వారా చేకూర్చే ప్రయోజనాలను ట్రాన్స్‌కో ఎఇ అప్పరావు వివరించారు. తమ ఇంటి గృహాలపై సోలార్ ప్లేట్‌లు అమర్చుకుని తమకు అవసరమైన విద్యుత్ ఉత్పతిని పొందవచ్చునన్నారు. ప్రకృతి వనరులలో ఒకటైన సూర్యరశ్మి ద్వారా కొంత మేరకు విద్యుత్‌ను పొందితే వినియోగదారులకు ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. మీరు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను వాడుకోగా మిగిలిని విద్యుత్‌కు ప్రభుత్వ గ్రిడ్‌కు చేరుతుందన్నారు. మాకు సరఫరా చేసిన విద్యుత్‌ను లెక్క కట్టి మీకు యూనిట్‌కు రూ.2.9 పైసలు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. నల్లిమెల్లి శ్రీనివాసరావు, కోడి నర్సింహం, బాబి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ సెట్ మీటర్ల ఏర్పాట్లకు ఇస్తున్న రాయితీని ఉపయోగించుకుని సోలార్ విద్యుత్ వాడకం వల్ల నగదును ఆదా చేసుకోవాలని పాలకొల్లు ఎలక్ట్రికల్ ఎడిఎ సిహెచ్.రామకృష్ణ తెలియజేశారు. పూలపల్లి గ్రామ పంచాయతీ ఆఫీస్ వద్ద సోలార్ విద్యుత్‌పై అవగాహనా సదస్సును గురువారం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులందరూ బ్రోమోడయోలిన్ మందును పొందాలి

నరసాపురం : రైతులందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వంచే ఉచితంగా పంపిణీ చేయుచున్న బ్రోమోడయోలిన్ మందును పొందాలని నరసాపురం ఎడిఎ ఈద అనిల్ కుమారి అన్నారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రెండో రోజు శుక్రవారం ముందు రోజు పూడ్చిన బొరియలను గుర్తించి అవి తెరిచి ఉంటే వాటిలో ఎలుకలు ఉన్నాయని నిర్ధారించుకుని రాష్ట్ర ప్రభుత్వంచే ఉచితంగా పంపిణీ చేసే బ్రోమోడయోలిన్ మందును చిన్న చిన్న పొట్లాలుగా చేసి తెరిచిన బొరియలలో ఉంచి, మరలా మట్టితో పూడ్చడం ద్వారా ఎలుకల ఉధృతిని నివారించవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.



నరసాపురం : రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

పెనుమంట్ర : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం కోసం ముందస్తు కార్యక్రమం చేపట్టినట్టు శాఖ అధికారి అడబాల జ్యోషిల తెలిపారు. రెండు రోజులుగా జరిగే ఈ కార్యక్రమంలో గురువారం గ్రామాల్లోని రైతులు తమ పొలం గట్లలో ఉన్నటువంటి సజీవ ఎలుకల బొరియలను గుర్తించి, వాటిని మట్టితో పూడ్చారని, శుక్రవారం ఎలుకల ద్వారా తెరచి ఉన్న బొరియల వద్ద బ్రోమోడయోలిన్ 0.25 శాతం నూకలు, నూనెతో కూడిన ఎర మందును ఉంచాలన్నారు. ఈ సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో మండలంలోని రైతులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి

తాడేపల్లిగూడెం : కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపారని, విభజన హామీల ఊసే లేదని రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అన్నారు. తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండ రామిరెడ్డి అధ్యక్షతన గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ 2014 రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్ అనేక వాగ్దానాలు చేసిందని, 2014లో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను నెరవేర్చకుండా రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని వారు తెలిపారు. ఈ రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, రాష్ట్ర రాజధాని, వెనకబడిన జిల్లాలు, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, కేంద్రం యూనివర్సిటీలు, గిరిజన యూనివర్సిటీలు ఏ ఒక్కటి కూడా అమలు చేయకుండా రాష్ట్ర బడ్జెట్ ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, కర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌వివిఎస్.రెడ్డి, ఆడప ఆంజనేయులు, వెంకటరావు, కర్రి సుబ్బిరెడ్డి పాల్గొన్నారు.

22న డిగ్రీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

పాలకొల్లు : స్థానిక ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో 22వ తేదీ శనివారం దివిస్ లేబరేటరీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించబడునని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించబడునని అన్నారు. అభ్యర్థులు బిఎస్‌సి, బిటెక్, ఎంఎస్‌సి, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ డిగ్రీలలో ఉత్తీర్ణులై వయస్సు 21-25 సం.లోపు ఉండవలెనని తెలిపారు. పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని, ట్రైనీ సూపర్వైజర్, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ జాబులకు నెలకు రూ.18 వేల నుంచి రూ.24 వేల వరకు జీతం, ఉచిత వసతి, భోజనం, పిఎఫ్, ఇఎస్ఐ, ఇతర సదుపాయాలు కలవని తెలిపారు. ఇతర వివరాలకు అభ్యర్థులు 9912046234 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అన్నసమారాధనలో యాత్రికులు


మొగల్తూరు : మొగల్తూరులోని కోట రోడ్‌లో ఉన్న శ్రీదత్త సాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు బాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమారాధనలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న యాత్రికులకు ఎటువంటి ఆసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాజశేఖరంను గెలిపించాలి

తణుకు రూరల్: ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి కనీసం అసెంబ్లీకు రాకుండా జైలు యాత్రలు చేస్తున్నారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఎద్దేవా చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కోరుతూ గురువారం తణుకు మండలం మండపాక గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉమా భీమేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట

కాళ్ల: మండలంలోని కలవపూడి గ్రామంలో లక్షలాది రూపాయల వ్యయంతో పునర్ నిర్మాణమైన ఉమా భీమేశ్వర స్వామి ఆలయం శిఖర గోపురాలు, వాటిపై రూపుదిద్దుకున్న రాతి చిత్రాలతో సోబిల్లుతుంది. దాతలు, గ్రామస్థుల సహకారంతో ఈ ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. పలువురు దాతలు, గ్రామస్థులు అందించిన భారీ విరాళాలతో శోభాయమానంగా రూపుదిద్దుకున్న ఈ ఆలయంలో ఈనెల 21న విగ్రహాలను శాస్త్రోక్తంగా కొలువు దీర్చేందుకు ఆలయ నిర్వహణ కమిటీ తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది. దాతల భారీ విరాళాలతో గ్రామంలో ఉమా భీమేశ్వర స్వామి ఆలయాన్ని 1967లో నిర్మించారు. ఎంతో ప్రాచుర్యం ఉన్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. గ్రామస్థులు, దాతలు అందించిన సుమారు లక్షలాది రూపాయల విరాళాలతో ఆలయ నిర్మాణం చకచకా పూర్తైంది. నిర్మాణంలో భాగస్వాములైన అందరికీ గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 21వ తేదీన ఆలయ ప్రతిష్ట, అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



కలవపూడిలో పునర్ నిర్మాణమైన భీమేశ్వర స్వామి ఆలయం